క్లుప్తంగా

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న భీంరెడ్డి తదితరులు

కుల్కచర్ల: నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కుల్కచర్ల మండల కేంద్రానికి చెందిన మిద్దె అంజయ్య ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5 వేలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆనందం, చంద్రయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి పరామర్శ



వీరేశాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశాన్ని ఆదివారం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పరామర్శించారు. వీరేశం తండ్రి శనివారం మృతి చెందడంతో ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పరామర్శించిన వారిలో సొసైటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్ మందిర్ పునర్నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న ఆలయ కమిటీ, భక్తులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణం ఇందిరానగర్‌లోని శ్రీరామ మందిరం పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పట్టణ ప్రముఖులు విరాళాలు అందజేశారు. డాక్టర్ సంపత్ కుమార్ రూ. 2 లక్షలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇందిరానగర్ వాసి వెల్డర్ గోపి రూ. 50 వేలు అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు సైతం ఒక్కొక్కరూ రూ. 50 వేల చొప్పున విరాళాలను ప్రకటించారు. ఈ నెల 30వ తేదీన ఆలయ శంకుస్థాపన నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు.

మల్లన్న ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న దాత శేఖర్‌రెడ్డి దంపతులు

చేవెళ్ల: ఆలయాల నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మల్లన్న ఆలయ కమిటీ సభ్యులు అన్నారు. చేవెళ్లలో నూతనంగా నిర్మిస్తున్న మల్లన్న స్వామి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన అత్తెల్లి సంజీవరెడ్డి, సువర్ణ కుమారుడు శేఖర్‌రెడ్డి 1 లక్ష 11 వేల రూపాయల విరాళం ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పెద్దఎత్తున చేవెళ్లలో మల్లన్న స్వామి ఆలయ నిర్మాణం చేపడుతున్నామని, దాతల సహకారం అందించాలని కోరారు. అనంతరం దాతను వారు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

రక్తమైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

మొయినాబాద్‌రూరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రక్తమైసమ్మ దేవాలయ అర్చకుడు అంజన్‌శాస్త్రీ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అమ్డాపూర్ రక్తమైసమ్మ దేవాలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విచ్చేసిన భక్తులకు అమ్మవారికి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దీంతో దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

ఇదేం విస్తరణ?

- విద్యుత్ స్తంభాలు తొలగించకుండానే జాతీయ రహదారి పనులు
- పట్టణ శివారులోని రసూల్‌పుర నుంచి గౌతాపూర్ వరకు..
- మూడేళ్ల క్రితం అదే తీరు
- అధికారుల పనితీరుపై సర్వత్రా విమర్శలు



రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

తాండూరు: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రోడ్డు అభివృద్ధి పనుల కోసం రూ.కోట్లు వెచ్చిస్తోన్న రోడ్డు విస్తరణ మాత్రం నిర్వహించడం లేదు. తాండూరు పట్టణం మీదుగా వెళ్లే జాతీయ రహదారి పనులు మూడేళ్లుగా కొనసాగుతున్నాయి. తొలి విడతలో కేంద్ర ప్రభుత్వం రూ.25 కోట్లను మంజూరు చేసింది. అయితే ఈ పనులను సదరు కాంట్రాక్టర్ స్థానికులకు సబ్‌లీజుకు ఇవ్వడంతో రోడ్డు విస్తరణ పనులను అడ్డగోలుగా చేసి బిల్లులు స్వాహా చేశారు. తాజాగా మరోసారి కేంద్ర ప్రభుత్వం తాండూరు పట్టణ శివారులోని రసూల్‌పుర నుంచి గౌతాపూర్ మార్గంలోని మొత్కుల వాడుక వరకు 4 కిలోమీటర్ల మేర నాలుగు లైన్‌ల రోడ్డు పనులను ప్రారంభించారు. అందులో భాగంగా పట్టణంలో రోడ్డు వెడల్పు చేసేందుకు ఇరువైపుల జేసీబీ యంత్రాలతో మట్టిని తొలగించి కంకర పోసే పనులు జరుగుతున్నాయి.

విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే..

తాండూరు పట్టణంలో జరుగుతున్న జాతీయ రహదారి పనులు అసంపూర్తిగా కొనసాగుతున్నాయి. రూ.25 కోట్ల నిధులతో చేపట్టిన పనులకు గాను మొదట రోడ్డు విస్తరించి తర్వాత బీటీ రోడ్డు పనులు చేపట్టాలి. కాని సంబంధిత శాఖ అధికారులు విద్యుత్ స్తంభాల చుట్టూ మట్టి తీయించి పనులు చేపడుతున్నారు. ఈ విషయంలో విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించకుండానే పనులు చేస్తుండడం గమనార్హం.

22 ట్రాన్స్‌ఫార్మర్‌లు.. 120 విద్యుత్ స్తంభాలు..

రసూల్‌పుర నుంచి గౌతాపూర్ సమీపంలోని మొత్కుల వాడుక వరకు 4 కిలోమీటర్ల లోపు 120 విద్యుత్ స్తంభాలు, 22 ట్రాన్స్‌ఫార్మర్‌లు రోడ్డుపైనే ఉన్నాయి. జాతీయ రహదారి పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలంటే విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను, తీగలను తొలగించేందుకు రూ.1.80 కోట్లు ఖర్చవుతోందని విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ రహదారి పనులు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో కొనసాగుతుండడంతో జాతీయ రహదారుల శాఖ విద్యుత్ శాఖకు అవసరమైన నిధులను కేటాయించాలి. కాని అలాంటిదేమి లేకుండానే రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. దీంతో ఈదురు గాలులు వీస్తే విద్యుత్ స్తంభాలు నేలకొరిగే ప్రమాదం ఉందని విద్యుత్ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రోడ్డుపై విద్యుత్ స్తంభాల కారణంగా పదుల సంఖ్యలో వాహనదారులు, ప్రజలు ప్రమాదాలకు గురయ్యారు. అధికారులు స్పందించకపోతే మరిన్ని అనర్థాలు జరగొచ్చని స్థానికులు చెబుతున్నారు.



స్తంభాల వద్ద రోడ్డు పనులు

> **నిధులు విడుదల చేస్తేనే పనులు**
>
> తాండూరు పట్టణం నుంచి వెళుతున్న జాతీయ రహదారి పనుల కోసం రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. స్తంభాలను తొలగించేందుకు రూ.1.80 కోట్లు వెచ్చించాలి. అందుకోసం ప్రతిపాదనలు తయారు చేసి సంబంధిత శాఖ అధికారులకు అందించాము. నిధులు విడుదలైతేనే పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది.
>
> – నారా రఘువీర్‌రెడ్డి, ఏఈ, విద్యుత్ శాఖ, తాండూరు పట్టణం

నత్తనడకన మోడల్ హౌస్ పనులు

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు



తాండూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పూర్తికాని మోడల్ హౌస్

తాండూరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి ప్రతీ మండల కేంద్రంలో ఓ మోడల్ హౌస్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగాను తాండూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రెండు నెలల క్రితం మోడల్ హౌస్‌కు భూమిపూజ చేసి నిర్మాణ పనులు చేపట్టారు. అయితే గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు రూ.5 లక్షలకే ఇళ్లు ఎలా నిర్మించుకోవాలనే ఆందోళన వ్యక్తం చేయడంతో ప్రభుత్వం మోడల్ హౌస్‌కు శ్రీకారం చుట్టింది. కానీ పనులు మాత్రం నత్తనడకన కొనసాగుతున్నాయి. రెండు వారాల క్రితం హౌసింగ్ జిల్లా పీడీ కృష్ణయ్య పనులు పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అయినా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పనులు పూర్తయితే గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన వారికి దీన్ని చూపించాలని అధికారులు భావించారు. గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక దాదాపు పూర్తవుతున్నా మోడల్ హౌస్ మాత్రం నేటికి పూర్తికాలేదు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

- అంబేడ్కర్ సంఘం నాయకుడు ఆనంద్ కుమార్
- నూతన ఎస్ఐ రమేశ్‌కు సన్మానం



ఎస్ఐ రమేశ్‌ను సన్మానిస్తున్న అంబేడ్కర్ సంఘాల నాయకులు

కుల్కచర్ల: పేదలకు చట్టాలపై అవగాహన కల్పించాలని అంబేడ్కర్ సంఘం నాయకుడు తుప్పలి ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం కుల్కచర్ల మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన రమేశ్‌ను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రజల ఆలోచన సరళిని దృష్టిలో ఉంచుకుని కేసుల నమోదు, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగని వెంకట్రాములు, చుక్కయ్య, జె.వెంకటయ్య, రవికుమార్, సాల్వీడు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



ముజాహిద్‌పూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆంజనేయులు, తదితరులు

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు

కుల్కచర్ల: రైతులు దళారులను నమ్మి ధాన్యం విక్రయించొద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం ముజాహిద్‌పూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొంతమంది ఉద్దేశపూర్వకంగా రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రాజకీయాలు చేస్తే సహించమని హెచ్చరించారు. రైతుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాములు, సోమలింగం, భాస్కర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి

ఇన్‌చార్జి ఏడీఏ నిషాంత్‌కుమార్

షాద్‌నగర్: రైతులు విత్తనాల ఎంపిక విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని షాద్‌నగర్ ఇన్‌చార్జి ఏడీఏ నిషాంత్‌కుమార్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలం నేపథ్యంలో రైతులు ఇప్పటి నుంచే దుక్కులు దున్నడం, విత్తనాలు కొనుగోలు చేయడం ప్రారంభించారన్నారు. అయితే విత్తనాల ఎంపికలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, మందులను మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, విధిగా వారి వద్ద రసీదు పొందాలని సూచించారు. స్థానిక పరిస్థితులకు అనుకూలంగా మంచి దిగుబడినిచ్చే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. ముఖ్యంగా రైతులు బీటీ విత్తనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గడ్డి మందు తట్టుకునే రకాలు అంటూ బీటీ విత్తనాలు అమ్ముతున్న వారిని గుర్తించి వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. అనుమతి లేని విత్తనాలు కొనడం, అమ్మడం నేరమన్నారు. అదేవిధంగా గ్రామాలకు వచ్చి విత్తనాలు విక్రయించే వారి పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

అర్హులందరికీ పథకాలు అందిస్తాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: అర్హులందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలంలోని వైఎంతండా, పులిచర్లకుంటతండా, సిద్ధాపూర్, ఎస్‌బీపల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పథకాలను కేవలం పార్టీ కార్యకర్తలకు మాత్రమే మంజూరు చేసినట్లు ఆరోపించారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలకతీతంగా వ్యవహరిస్తూ ప్రజాక్షేత్రంలో సభలు నిర్వహించి పారదర్శకంగా అర్హులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక విపక్షాలు తమ ఉనికిని కాపాడుకోవడానికి లేనిపోని ఆరోపణలు చేస్తున్నట్లు విమర్శించారు. కొద్దిగా ఆలస్యమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఇటీవల విడుదలైన ఎప్‌సెట్ ఫలితాల్లో 446 ర్యాంకు సాధించిన ఎస్‌బీపల్లి గ్రామానికి చెందిన దండు నందును ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో మరింత నైపుణ్యం సాధించి రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, ఎల్లారం శేఖర్‌రెడ్డి, అంబటి ప్రభాకర్, సురేశ్‌గౌడ్, వీరమోని దేవేందర్, ఎమ్మె సత్తయ్య, కొమ్ము కృష్ణ, రవీందర్‌రెడ్డి, జంగయ్య, సిద్ధార్థరెడ్డి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠ

దౌల్తాబాద్: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో సోమవారం మల్లికార్జున స్వామి దేవాలయ ఆవరణలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9గంటలకు గణపతి పూజ, నవగ్రహ పూజతో పాటు హోమం నిర్వహిస్తారని అనంతరం 11గంటలకు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

రేపు తిరంగా ర్యాలీ

బీజేపీ మండల అధ్యక్షుడు అశిరెడ్డి

మోమిన్‌పేట: ఆపరేషన్ సిందూర్‌లో ఉగ్రవాదులను మట్టు పెట్టిన సందర్భంగా మంగళవారం తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు అశిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని మేకవనంపల్లి గ్రామం నుంచి ఉదయం 9గంటలకు ప్రారంభమై బూర్గుపల్లి, మోమిన్‌పేట, మొరంగపల్లి, వెల్‌చాల్, మల్లారెడ్డి గూడెం, గోవిందాపూర్ మీదుగా ఏన్కతల చేరుకుంటుందని పేర్కొన్నారు. దేశ అభిమానులు, పార్టీలకు అతీతంగా యువజన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల ని ఆయన కోరారు.

పేద కుటుంబాలకు అండగా ఉంటా

మాజీ సర్పంచ్ అనంతయ్య

దోమ: పేద కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ సర్పంచ్ అనంతయ్య అన్నారు. దోమ మండల పరిధిలోని బాస్‌పల్లి గ్రామానికి చెందిన బ్యాగరి భారతమ్మ కూతురు వివాహం సోమవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అనంతయ్య వివాహానికి ఆదివారం పుస్తే మెట్టెలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామంలో ఆపదలో ఉన్న పేదలకు అండగా ఉంటూ అన్ని విధాలుగా ఆదుకుంటానని ఆయన గ్రామస్తులకు భరోసా కల్పించారు.

బసవన్న, శివలింగం ప్రతిష్ఠాపన

అంతారంలో ప్రత్యేక పూజలు



బసవన్న, శివలింగం పూజలో భక్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలో అంతారం గ్రామంలోని కట్టమైసమ్మ దేవాలయ సమీపంలో నూతనంగా బసవన్న, శివలింగం విగ్రహాల పునఃప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. తాండూరు పట్టణానికి చెందిన గూళీ శివకుమార్, గూళీ పరమేశ్వర స్వామి కుటుంబ సభ్యులు నూతన విగ్రహాలకు పునఃప్రతిష్ఠాపనకు ముందుకు వచ్చారు. కట్టమైసమ్మ దేవాలయం వద్ద విగ్రహాల ప్రతిష్ఠాపన కోసం కొత్తగా బసవన్న కట్టను నిర్మించారు. శనివారం రాత్రి గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి నూతన విగ్రహాల ఊరేగింపు చేపట్టారు. ఆదివారం వేదపండితుల సమక్షంలో గూళీ శివకుమార్, గూళీ పరమేశ్వర్ బంధువులు, భక్తుల సమక్షంలో నూతన విగ్రహాలను ప్రతిష్ఠింపజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పుల్లా వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వడ్డె చంద్రయ్య, రాములు, శాంతు, విజయేందర్‌రెడ్డి, ధర్మిదీ శ్రీనివాస్‌రెడ్డి, కుర్వ శ్రీనివాస్, లక్ష్మణ్, బాతుల వెంకటయ్య, బంటార్వం భద్రేశ్వర్, చెన్‌బసప్పలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

తాండూరు టౌన్: వారందరూ 20 ఏళ్ల క్రితం 2005–06వ సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్నారు. జీవితంలో ఎక్కడెక్కడో స్థిర పడ్డారు. అందరూ ఒకసారి కలుసుకోవాలనుకున్నారు. పదోతరగతి చదివిన రోజులను, ఉపాధ్యాయులను, చిరు జ్ఞాపకాలను నెమరేసుకోవాలనుకున్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ నంబర్ వన్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలలో చేసిన అల్లరిపనులను గుర్తు చేసుకుంటూ మురిసిపోయారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

షాద్‌నగర్: పట్టణానికి చెందిన దంత వైద్యుడు కొమ్ము మహర్షి ఇటీవల హైదరాబాద్‌లో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం కన్జ్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సంస్థ సభ్యులు షాద్‌నగర్ పట్టణంలో నివాసం ఉంటున్న మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి తండ్రి వెంకన్నబాబును వారు ఓదార్చారు. పరామర్శించిన వారిలో సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి భీంరెడ్డి, ఉపాధ్యక్షుడు ఏవీరావు, నాయకులు సత్యనారాయణ, నర్సింహారెడ్డి, యాదిరెడ్డి, రమణయ్య, రాంచందర్ తదితరులు ఉన్నారు.

కారు మబ్బులు.. రైతుల్లో గుబులు

- ధాన్యం కొనుగోళ్లలో కానరాని వేగం
- లారీల కొరత
- ఇబ్బందుల్లో అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు



ధాన్యాన్ని సంచుల్లో నింపుతున్న రైతు

దౌల్తాబాద్: వారం రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఉదయం ఎండ, సాయంత్రమయ్యేసరికి మబ్బులు కమ్ముకుంటుంది. అక్కడక్కడ వర్ష సూచన ఉండడంతో రైతులు గుబులు చెందుతున్నారు. యాసంగి ధాన్యం కొనుగోళ్ల కోసం మండలంలో సహకార సంఘం, ఐకేపీ ఆధ్వర్యంలో 13కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చి కుప్పలుగా పోస్తున్నారు. తేమశాతం ఎక్కువగా ఉండడంతో ఆరబెట్టాల్సి వస్తుంది. కొన్ని కేంద్రాల్లో కొనుగోళ్ల నెమ్మదిగా జరుగుతుండడంతో ఎప్పుడు వర్షం పడుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

తేమ శాతం 17లోపు ఉంటేనే..

యాసంగి ధాన్యం సేకరణకు మండలంలో 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. సుమారు 16వేల ఎకరాలకు పైగా వరి సాగు చేశారు. ఇప్పటి వరకు ఆయా కేంద్రాల్లో 40వేల వరకు ధాన్యం బస్తాలను కొనుగోలు చేశారు. ఇంకా కేంద్రాల వద్ద ధాన్యాన్ని కుప్పలుగా పోశారు. తేమ శాతం 17లోపు ఉంటేనే వాటిని ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తేమశాతం నిర్ధారించి అనుమతిస్తేనే సేకరణ చేస్తున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు రాకపోవడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కర్షకులు తేమ లేకుండా ఆరబెట్టేందుకు శ్రమిస్తున్నా ఒక్కోసారి అకాల వర్షాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. రెండు రోజుల క్రితం దౌల్తాబాద్‌లో వర్షం పడడంతో ధాన్యం తడిసిపోయింది. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కొనుగోళ్లను వేగవంతం చేయాలని, లారీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.